ఎమ్మెల్యే అభినందన



మారథాన్ రన్నర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: 130వ బోస్టన్ మారథాన్ రేసుకు అర్హత సాధించిన మల్లాపూర్‌కు చెందిన మారథాన్ రన్నర్ చాలమలశెట్టి నాగభూషణంరావును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 74 ఏళ్ల వయస్సులో అమెరికా బోస్టన్‌లో జరగబోయే మారథాన్ రేసుకు అర్హత సాధించి, యువతకు స్ఫూర్తిని చ్చారన్నారు. యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ తరపున మరిన్ని మారథాన్ పోటీల్లో పాల్గొని దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



గౌతంనగర్: డివిజన్ వాణినగర్‌లోని విజయ వినాయక ఆలయ 49వ వార్షిక బ్రహ్మోత్సవాలను వేదపండితులు కందాల రమేష్‌శర్మ నేతృత్వంలో అర్చకబృందం ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, సహస్రమోదక గణపతి హోమం అనంతరం స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, పూర్ణాహుతి, కలశోద్వాసన, మహాకుంభాభిషేకం, అలంకరణ, మంగళహారతి, అన్నప్రసాదవితరణ కార్యక్రమాలు జరిగాయి.

పద్మశాలి సంఘం నూతన కమిటీ



బోడుప్పల్: మేడిపల్లి పద్మశాలి సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బండారు మల్లేశం, గౌరవ అధ్యక్షులుగా రుద్ర పాపయ్య, ప్రధాన కార్యదర్శిగా బిట్ల శ్రీనివాస్, కోశాధికారిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా రవీందర్, సుధాకర్, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా చంద్రమౌళి, బొల్లు శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా కొంగర శ్యామ్‌సుందర్, సిద్దుల శ్రీనివాస్, గుత్తికొండ వెంకటేష్, తిరుపతి ఎన్నికయ్యారు.

అనధికారంగా నిర్వహిస్తున్న లాడ్జ్‌ను మూసి వేయాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఘట్కేసర్ మండలం, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్ షిప్, అన్నోజిగూడ , భగత్ నగర్ కాలనీ (గేటెడ్ కమ్యూనిటి)లో చట్ట విరుద్ధంగా కాకతీయ గ్రాండ్ హోటల్, కంపెనీ- సర్వీసెస్ హోటల్ 'ఓ ' పేరుతో నిర్వహిస్తున్న ఓయో/లాడ్జ్‌ను వెంటనే సీజ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సత్యప్రకాష్,ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర ,సీపీఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం, జిల్లా నాయకులు చింతల యాదయ్య, సబిత, మహిళా సంఘం జిల్లా నాయకురాలు సృజన , బీజేపీ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. అన్నోజిగూడలో ఓయో పేరుతో హోటల్ నిర్వహిస్తున్న భవనానికి మున్సిపాలిటీ నుంచి రెసిడెన్షియల్ అనుమతి మాత్రమే ఉందన్నారు.ఆ భవనానికి వాణిజ్య కార్యకలాపాలకు నిర్వహించటానికి ఎలాంటి సీఎల్‌యూ , ట్రేడ్ లైసెన్స్, పోలీస్ ఎన్‌ఓసీ, ఫైర్ సేఫ్టీ, హెల్త్ సర్టిఫికేట్ లేవన్నారు. రాత్రి సమయంలో ఆ ప్రాంతంలో అనుమానిత వ్యక్తుల రాకపోకలు పెరగటంతోపాటు భద్రత సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అర్ధరాత్రి దాటాక ఓయో గదుల్లో పార్టీలు నిర్వహిస్తుండటంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సదరు భవనానికి వాహన పార్కింగ్ లేకపోవటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. స్థానిక మున్సిపల్, పోలీసులు అధికారులు సత్వరమే భవనాన్ని సీజ్ చేయటంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కుక్కల బెడద నివారించండి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు అన్నారు. ఆదివారం కళావేదిక వద్ద జరిగిన సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో పలు సమస్యలపై కమిటీ చర్చించింది. కుక్కల బెడద, పార్కింగ్ సమస్య, దుకాణాల ఏర్పాటు అంశాలపై తీర్మానాలు చేశారు.

స్వచ్ఛతపై చర్యలేవి ?

- తడి, పొడి చెత్తను వేరు చేయకుండానే సేకరణ
- దుర్వాసనతో అవస్థలు పడుతున్న కాలనీవాసులు



బోడుప్పల్ డంపింగ్‌లో కుప్పలుగా వ్యర్థాలు

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న చెత్త డంపింగ్ యార్డు నుంచి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. స్వచ్ఛ ఆటోల ద్వారా డంపింగ్‌కు తీసుకొచ్చిన చెత్తను సకాలంలో జవహర్‌నగర్‌కు తరలించడం లేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయకుండా డంపింగ్‌యార్డుకు తీసుకురావడంతో కార్మికులు అనారోగ్యానికి గురౌతున్నారు.

52 టన్నుల వ్యర్థాల సేకరణ..

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 200కు పైగా కాలనీలు ఉన్నాయి. సదరు కాలనీల నుంచి రోజుకు 52 టన్నుల చెత్త వస్తుంది. 262 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. 68 స్వచ్ఛ ఆటోల ద్వారా ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్నారు.

◆ మున్సిపల్ నుంచి 10 ట్రాక్టర్లు, మరో 5 ఆటోలు ఉన్నాయి. 20 మంది సూపర్‌వైజర్లు, ఒక హెల్త్ అసిస్టెంట్, ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్నారు.

వేరు చేయకుండానే సేకరణ..

నగర పాలక సంస్థ పరిధిలో 35 వేల ఇళ్లు ఉన్నాయి. ఇంటి యజమానులు తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలి. కానీ గత కొంతకాలంగా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందిస్తున్నారు. ఇలా సేకరించిన చెత్తను డంపింగ్‌కు తరలిస్తున్నారు. సదరు చెత్త నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే తొలగిస్తున్నారు. మిగతా తడి చెత్త, పొడి చెత్తను అలాగే వదిలేస్తున్నారు.

కనిపించని కంపోస్టు ఎరువు..

గత కొంతకాలంగా చెత్త డంపింగ్‌లో తడి చెత్తను విండ్రో కంపోస్టు తయారు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో స్వచ్ఛ ఆటోల ద్వారా వచ్చిన చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసేవారు. తడి చెత్తను విండ్రో కంపోస్టును తయారు చేసేవారు. పొడి చెత్త నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి, మిగతా చెత్తను జవహర్‌నగర్‌కు తరలించే వారు. ప్రస్తుతం తడి, పొడి చెత్త నుంచి కేవలం ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే వేరు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనారోగ్యానికి గురౌతున్న సిబ్బంది..

చెత్త డంపింగ్ పరిసర ప్రాంతాలంతా అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ఎటుచూసినా చెత్తే కనిపిస్తోంది. చెత్త డంపింగ్ విషయంలో అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జనావాసాలకు దూరంగా డంప్ చేయాలి



చెత్త డంపింగ్ వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. డంపింగ్‌ను ఆనుకుని ఉన్న శ్రీసాయినగర్, అన్నపూర్ణ కాలనీ, పద్మావతికాలనీ, రాజీవ్‌నగర్, గౌతమీనగర్ కాలనీల్లో వాయు కలుష్యం వెదజల్లుతోంది. ఇక్కడ ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. జనావాసాలకు దూరంగా చెత్త డంపింగ్‌ను తొలగించాలి, చెత్తను సకాలంలో తొలగించి కాలనీప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– అబ్రహం లింకన్, ఫెడరేషన్ అధ్యక్షుడు

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



బోడుప్పల్: ప్రతి ఒక్కరం అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. బోడుప్పల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి 346వ వారం జ్ఞానమాల వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అంబేడ్కర్ అందించిన వజ్రాయుధం ఓటు హక్కు అని, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు రాజకీయాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలకు సేవ చేసే వారికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. లక్ష్మీనారాయణ, రాపోలు శ్రీరాములు, బండారి సాయి, చిల్ల అంజయ్య, యేసు రాజు, సగ్గ నర్సింహ్మా, జడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు !



ఎంప్లాయిస్ కాలనీలో తవ్వి వదిలేసిన రోడ్డుపై నిలిచిన మురుగు

అల్వాల్: కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం అధికారుల అలసత్వం కాలనీవాసుల పాలిట శాపంగా మారుతోంది. యాప్రాల్‌లోని ఎంప్లాయిస్ కాలనీలో 4 నెలల క్రితం ప్రారంభించిన డ్రైనేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో మురుగు ఇళ్ల మధ్యలో నిలిచిపోవడంతో రోజంతా దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ పిల్లలు ప్రమాదానికి గురౌతున్నారని, వర్షం పడిందంటే సమస్య మరింత తీవ్రతరం అవుతుందన్నారు. కాలనీలోని 4వ వీధిలో ఈ సమస్య అధికంగా ఉందని, సమస్య పరిష్కారానికి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



మల్లాపూర్: దేవాలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అనంతరామ్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ నాగలక్ష్మీనగర్ కాలనీలోని నందీశ్వరాలయంలో నాగదేవత, నవగ్రహాల చుట్టూ రూ.21 వేలతో గ్రిల్స్ ఏర్పాటు చేయించారు. కమిటీ సభ్యులు ఆయనను పీజీ సుదర్శన్, శ్రీహరిగౌడ్, రాజేష్ అలయ అర్చకులు మనోజ్ పంతులు సత్కరించారు.

పొంచి ఉన్న ప్రమాదం

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఇందిరానగర్‌లో అంతర్గత రోడ్డులో రహదారి పక్కన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి నూతన మ్యాన్‌హోల్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.



ఈస్ట్ ఇందిరానగర్‌లో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

శాంతి స్థాపనే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం



శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు, స్థానికులు

ఘట్‌కేసర్: దేశంలో శాంతి నెలకొల్పడంలో ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) ప్రముఖ పాత్ర పోషిస్తుందని భాగ్ ధర్మజాగరణ ప్రముఖ్ వంశీకృష్ణ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభించి 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మున్సిపాలిటీలోని మర్పల్లిగూడలో ఆదివారం నిర్వహించిన శతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం మేలు కోసం నిత్యం గంట సమయం శాఖకు కేటాయించాలని, సంఘానికి సమయం ఇవ్వడమంటే సమాజ అభివృద్ధికి కృషి చేయడమేన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి సరిహద్దు దేశాలు, దేశంలోని దుష్టశక్తులు ఎదురు చూస్తున్నాయన్నారు. ప్రజలందరూ ఐక్యతతో ఉంటే ఎవరూ మనల్ని ఏమీ చేయలేరని దేశంలో శాంతి నెలకొనాలంటే ప్రతి ఇంటిలో స్వయం సేవక్ ఉండాలని, లక్షలాది స్వయం సేవకులను తయారు చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ శ్రీశైలం, స్వయం సేవకులు, స్థానికులు పాల్గొన్నారు.

వైద్యం అందరికీ అందుబాటులోకి రావాలి



పోచారం: వైద్యం అందరికీ అందుబాటులోకి రావాలని పోచారం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం అన్నోజిగూడలోని ప్రకాష్‌నగర్‌లో వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక చికిత్సతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వైద్యుడిని దేవుడితో సమానంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, డాక్టర్ శివకృష్ణ, రమేష్, మల్లేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయన్స్ క్లబ్ తోడ్పాటు



పోలీసులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అల్వాల్: సమాజ సేవకులకు లయన్స్ క్లబ్ గౌరవాన్ని అందిస్తుందని డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.ఇన్నారెడ్డి అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్‌లో జరిగిన కార్యక్రమంలో శానిటరీ కార్మికులకు, పోలీస్ అధికారులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. వారు మాట్లాడుతూ.. సమాజ సేవలో కార్మికుల పాత్ర కీలకమని వివరించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కళ్లెం కృష్ణారెడ్డి, లయన్ కృష్ణప్రసాద్, లయన్ సురేష్‌కుమార్, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, యాదగిరి, అశోక్‌యాదవ్, రమేష్, సోమరాజు, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలిక మృతి

ఘట్‌కేసర్: లారీని ఓ కారు ఢీకొన్న ఘటనలో గాయపడిన బాలిక చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి స్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ మండలం, కొందుర్గుకు చెందిన దోపరల్లి సుధాకర్ కారులో లక్ష్మీ నర్సింహ్మా స్వామి దర్శనం కోసం శనివారం యాదగిరిగుట్టకు బయల్దేరారు. ఘట్‌కేసర్ ఘనాపూర్ వద్దకు రాగానే ఓఆర్ఆర్‌పై వేగంగా వెళుతున్న కారు ముందు వెళుతున్న లారీని వెనక వైపు నుంచి ఢీకొట్టడంతో ఆయన కుమార్తె నిహారిక (13)కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఘట్‌కేసర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిహారిక ఆదివారం ఉదయం మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా కారు నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన కాలనీ సంక్షేమ సంఘం కాలపరిమితి



రామంతాపూర్ : రామంతాపూర్‌లోని అతిపెద్దదైన శ్రీనగర్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ కాలపరిమితి ముగిసింది. ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్‌లో కాలనీ ఎన్నికల కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జలీల్ పాషా ఈ విషయాన్ని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ వచ్చే ఆదివారం 12న జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

అలరించిన భరత నాట్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం సముద్రాల మాధవి రామానుజం శిష్యబృందంచే నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. మూషికవాహన, శివస్తుతి, అన్నమాచార్య కీర్తన, అర్ధనారీశ్వర తదితర అంశాలు కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

సమాజ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకం



కీసర: సమాజ నిర్మాణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పాత్ర కీలకమని మల్కాజిగిరి గో సేవ ప్రముఖ్ పంతంగి బాలమురళీకృష్ణ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కీసర బండ్లగూడలో విజయదశమి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచపరివర్తన ద్వారా సమాజంలో గొప్ప మార్పులు తీసుకురావచ్చన్నారు. సమాజ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. వందేళ్లుగా సమాజ నిర్మాణంలో పాలుపంచుకుంటుందన్నారు. కార్యక్రమంలో దొంతిరి సాయిరామ్‌రెడ్డి, మొగుళ్ల శ్రీకాంత్ రెడ్డి, సానాల వెంకటచారి, ఆనంద్‌రావు, స్వయం సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగులు !

అధ్వానంగా వీధిలైట్ల నిర్వహణ



ఆర్టీసీకాలనీలో వెలుగుతున్న వీధిలైటు

మౌలాలి: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. రాత్రుళ్లు వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రిపూట మహిళలు ఒంటరిగా వెళ్లాలంటే జంకుతున్నారు.

విన్నవించినా ఫలితం శూన్యం



వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని జీహెచ్‌ఎంసీలోని సంబంధిత ఏఈకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సమస్యలపై ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. రాత్రుళ్లు మహిళల ఇబ్బందులను గుర్తించి ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– సునీత, మౌలాలి కార్పొరేటర్

పర్యవేక్షణ కరువు..

ఆర్టీసీకాలనీ, షఫీనగర్, హనుమాన్‌నగర్ తదితర కాలనీల్లో పగలు కూడా వెలుగుతున్నా.. పట్టించుకోవడం లేదు. సాయినాథపురం ప్రాంతంలో ఒక వీధిలో వెలిగితే మరో వీధిలో వెలగడం లేదు. వెలిగిన చోట పగలు కూడా నెలరోజులుగా వెలుగుతున్నాయి.

◆ మల్కాజిగిరి పరిధిలో సుమారు 18 వేల వీధిదీపాలు ఉండగా.. సరాసరి నిత్యం 40 ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారులు ఛిద్రం !



దెబ్బతిన్న చిలుకానగర్ రహదారి

ఉప్పల్: ఇటీవల కురుస్తున్న వర్షాలు, నిర్వహణలోపంతో చిలుకానగర్ గుంతమయంగా మారింది. రహదారి పొడవునా అడుగుకో గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయ ఏర్పడుతోంది. రోడ్డు గుంతలు పడి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఛిద్రమైన రోడ్డుపై డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతూ.. వాహనదారులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. కోట్లాది రూపాయలతో డివిజన్లను అభివృద్ధి చేస్తున్నామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. అవి కేవలం మాటలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలున్నాయి.

◆ ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి నుంచి కావేరినగర్ నాలా మీదుగా చిలుకానగర్ చౌరస్తా వరకు దాదాపుగా రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. దారిపొడవునా నిత్యం వేలాది వాహనాలు వెళ్లే మార్గం కూడా ఇదే. ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, వివిధ పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు ఇలా రోజుకు వేలాదిగా ప్రయాణం సాగిస్తుంటారు.

◆ ఉప్పల్ నుంచి నేరుగా బీరప్పగడ్డ, కావేరినగర్, చిలుకానగర్, నాచారం హేమనగర్, బోడుప్పల్, మల్లాపూర్ తదితర ప్రాంతాలకు ప్రధానంగా వెళ్లే ప్రధాన రహదారి కావడం వల్ల నిత్యం ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. రోజూ ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంతలు పడి ఏళ్లు గడుస్తున్నాయి.



రోడ్డుకు గుంతలు ఏర్పడి 2–3 ఏళ్లు అవుతోంది. స్థానికులమంతా కలిసి అనేకసార్లు జీహెచ్‌ఎంసీలో ఫిర్యాదు చేశాం. ఆఫీస్ చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. నాచారం, మల్లాపూర్‌లో ఉన్న పెద్ద పెద్ద స్కూళ్లకు వెళ్లే సమయాల్లో విద్యార్థులు, వారిని తీసుకెళ్లే తల్లిదండ్రులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

– నరేంద్ర, స్థానికుడు

రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం

కొత్త రహదారి ప్రతిపాదనకు రూ. 6 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రోడ్డు టెండర్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. మొదటి దశగా డ్రైనేజీ పైపులైన్ చిలుకానగర్ బాబూజగ్జీవన్‌రాం చౌరస్తా నుంచి కావేరినగర్ నాలా వరకు పనులు పూర్తైతే రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం.

– ఈఈ హరిలాల్